ఆన్‌లైన్ మోసం ఏపీకే లింకులతోఎర

- నలుగురి ఖాతాల్లోని రూ. 3.25 లక్షలు స్వాహా
- బాధితులందరూ సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటవాసులే

గంభీరావుపేట, మే 20: సైబర్ చీటర్లు రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన నలుగురిని కొత్త తరహాలో మోసం చేశారు. వాట్సాప్ గ్రూపుల్లోని ఫోన్ నంబర్లను హ్యాక్ చేసి, వారి పేరిట గ్రూపుల్లో ఏపీకే ఫేక్ లింకులు షేర్‌చేశారు. తెలిసిన వారే పంపించారని లింక్ ఓపెన్ చేయగానే వారి ఖాతాల్లోని డబ్బు మాయమైంది. ఇలా నాలుగు రోజుల్లో నలుగురి ఖాతాల్లో రూ. 3.25 లక్షలు స్వాహా చేశారు. సోమవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన పాల సంఘం అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి పేరిట సంఘం వాట్సాప్ గ్రూపులో ఏపీకే లింక్‌ను పంపించారు. ఆయన దీనిని ఓపెన్ చేయగా అతడి ఖాతాలోని రూ. 45,500 మాయమయ్యాయి. అలాగే లింక్‌ను తెరిచిన దండు నరేశ్ ఖాతా నుంచి రూ.44,900, లింగారెడ్డిగారి రాజశేఖర్‌రెడ్డి అకౌంట్ నుంచి రూ.50 వేలు, కోటయ్యగారి లత ఖాతా నుంచి రూ.1.85 లక్షలు ఇలా నాలుగు రోజుల్లో రూ.3.25 లక్షలు లూటీ చేశారు. ఫోన్లకు వచ్చిన మెస్సేజ్‌ను చూసి యూనియన్ బ్యాంక్ ఖాతాదారులైన వీరు సోమవారం పాస్‌బుక్కులతో బ్యాంక్ సిబ్బందిని సంప్రదించారు. ఖాతాలను పరిశీలించిన సిబ్బంది నగదు డెబిట్ అయినట్లు నిర్ధారించారు. దీంతో వీరు గంభీరావుపేట ఠాణా పోలీసుల సాయంతో సైబర్‌క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రైతాంగానికి పోలీసుశాఖ సోమవారం సూచించింది. కొనుగోలు సమయంలో ఒకటికి రెండుసార్లు విత్తనాలు చెక్ చేసుకోవాలని తెలిపింది. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని అనుమానం వచ్చినా, నకిలీవని తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీజీపీ రవిగుప్తా కోరారు.

లక్ష్మీనరసింహుడి జయంత్యుత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం, అనుబంధ దేవాలయం పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం లక్ష్మీనృసింహ స్వామి జయంత్యుత్సవాలను అర్చకులు అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఆలయ ముఖమండపంలో స్వస్తివాచనం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగరణం, కుంకుమార్చన, రక్షాబంధనం వంటి కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు మృత్స్యంగ్రహణం, అంకురార్పణ, హవనం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. గరుడవాహనంపై పరమవాసుదేవ అలంకార సేవను ప్రధానాలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

–యాదగిరిగుట్ట

బెంగళూరు రేవ్ పార్టీలో డ్రగ్స్

- పోలీసుల దాడిలో మత్తుమందులు లభ్యం
- ఆ పార్టీకి తెలుగు సినీతారలు వెళ్లినట్టు ప్రచారం
- తాము వెళ్లలేదంటూ కొందరి వివరణ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): బెంగళూరు శివారులో ఆదివారం జరిగిన రేవ్ పార్టీ తెలుగు సినీ పరిశ్రమలో కలకం రేపింది. ఆ రేవ్‌పార్టీపై పోలీసులు జరిపిన దాడిలో కొందరు నటీనటులు పట్టుబడ్డారని వార్తలు వెలువడటంతో ఎవరికి వారే తాము అక్కడ లేమంటూ వివరణ ఇచ్చుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వాసు అనే వ్యాపారి బెంగళూరులోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో బర్త్‌డే పార్టీ ఇచ్చాడు. ఈ పార్టీకి బెంగళూరు, హైదరాబాద్ నుంచి పలువురు ప్రముఖులతో పాటు విందులో వినోదం కోసం కొంతమంది యువతులను, మోడల్స్‌ను, సినీ రంగానికి చెందిన పలువురిని ఆహ్వానించారని బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు తెలిపారు. సుమారు 100 మందికిపైగా ఈ పార్టీకి హాజరవగా, వీరిలో చాలామందికి మత్తుమందులు సరఫరా చేసినట్టు తెలిసింది. ఈ సమాచారం అందుకున్న బెంగళూరు సీసీబీ పోలీసులు అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. ఈ దాడుల్లో 17 ఎండీఎంఏ మాత్రలు, కొకైన్, ఇతర డ్రగ్స్ లభించాయి. దీంతో పార్టీకి హాజరైన వారి వివరాలు తీసుకొని నిర్వాహకులైన వాసు, ఫామ్‌హౌస్ యజమాని రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపాల్‌రెడ్డి మరో ముగ్గురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఖరీదైన కార్లు, మద్యం, నగదు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో ఐదుగురికి డ్రగ్స్ టెస్టు నిర్వహించగా.. పాజిటివ్ వచ్చినట్టు సమాచారం. దీంతో డ్రగ్స్ ఎలా సరఫరా అయిందనే కోణంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాగా 2020లో కూడా ఇదే గోపాల్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో రేవ్‌పార్టీ జరగగా పోలీసులు సోదాలు చేసి, డ్రగ్స్, మద్యం స్వాధీనం చేసుకున్నారు.

మేం ఆ పార్టీకి వెళ్లలేదు: శ్రీకాంత్, హేమ

ఈ రేవ్‌పార్టీలో అరెస్టయిన వారిలో ప్రముఖ సినీనటులు కూడా ఉన్నట్టు వార్తలు రావడంతో కొందరు తాము అక్కడికి వెళ్లలేదంటూ వివరణ ఇచ్చుకున్నారు. ప్రముఖ నటుడు శ్రీకాంత్ ఒక వీడియో విడుదల చేస్తూ.. 'నేను రేవ్ పార్టీలకు వెళ్లే వ్యక్తిని కాదు' అని పేర్కొన్నారు. మరో నటి హేమ సైతం తాను రేవ్ పార్టీకి వెళ్లాననటం ఫేక్ న్యూస్ అని తెలిపారు. ఆ రేవ్ పార్టీలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు తనది కాదని ఏపీకి చెందిన మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి తెలిపారు. ఆ కారుతో, ఆ కారు యజమానితో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : తిరుమలలో మూడురోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతున్నది. ఉచిత సర్వదర్శనానికి అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, బయట క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారని టీటీడీ తెలిపింది. ఫ్రీ దర్శనానికి దాదాపు 16 గంటలు కాగా, రూ.300 ప్రత్యేక దర్శనానికి 4 గంటల సమయం పడుతుందని తెలిపింది. మరోవైపు, టైమ్‌స్లాట్ ఎస్ఎస్‌డీ దర్శనం కోసం 12 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. వీరికి దాదాపు 5 గంటల సమయం పడుతుంది.

జూన్ 8న చేప ప్రసాదం

ఖైరతాబాద్, మే 20: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వచ్చే నెల 8న ఉదయం11గంటలకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు దివంగత బత్తిని హరినాథ్‌గౌడ్ తనయుడు అమర్‌నాథ్‌గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మున్సిపాలిటీ, పోలీసు శాఖ తగిన ఏర్పాట్లు చేయాలని, మత్స్యశాఖ వారు కావాల్సిన చేపలను సిద్ధం చేయాలని వినతిపత్రాలు అందించామని తెలిపారు. అగర్వాల్ సేవాదళ్ స్వచ్ఛంద సంస్థ భోజన సౌకర్యాలు, బద్రీ విశాల్ పన్నాలాల్ పిట్టి ట్రస్ట్ చైర్మన్ శరత్‌పిట్టి సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఉబ్బసం రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రైవింగ్ లైసెన్స్ జారీకి కొత్త రూల్స్

జూన్ 1 నుంచి అమల్లోకి

హైదరాబాద్, మే 20(నమస్తే తెలంగాణ) : డ్రైవింగ్ లైసెన్స్ జారీకి కేంద్రప్రభుత్వం ఇటీవల సరికొత్త రూల్స్‌ను ప్రవేశపెట్టింది. ఇక నుంచి ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రైవేట్ సంస్థల్లోనూ డ్రైవింగ్ లైసెన్స్‌ను జారీ చేసే విధంగా చట్టాలు మార్చింది. ఈ కొత్త రూల్స్ జూన్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొంది ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సదుపాయాలు ఉన్న ప్రైవేటు సంస్థలు డ్రైవింగ్ టెస్టులు నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వవచ్చు. ప్రైవేటు డ్రైవింగ్ సెంటర్‌కి కనీసం 3 ఎకరాల స్థలం, ట్రైనర్లకు హైస్కూల్ విద్య, డ్రైవింగ్‌లో ఐదేండ్ల అనుభవం కచ్చితంగా ఉండాలి. కాగా ఈ రూల్స్ ప్రకారం..లైట్ వెహికల్స్‌కు 29 గంటలు, హెవీ వెహికల్స్‌కు 39 గంటల శిక్షణ తప్పనిసరిగా ఇవ్వాలని, ఆ తర్వాతే వారికి టెస్ట్ ద్వారా లైసెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్ ప్రాంతాల్లోని ఆర్డీవో కార్యాలయంలో మాత్రమే ఈ లైసెన్స్‌ను పొందుతున్న విషయం తెలిసిందే.

ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారులు

ఇంటి అనుమతి కోసం లంచం డిమాండ్

ఏసీబీకి పట్టుబడిన నానాజీపూర్ బిల్‌కలెక్టర్ బాల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రాధిక

శంషాబాద్ రూరల్, మే 20 : ఇంటి నిర్మాణానికి కావాల్సిన అనుమతులు ఇచ్చేందుకు లంచం తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్‌ను ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బర్కత్ అలీకి శంషాబాద్ మండలంలోని నానాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 500 గజాల స్థలం ఉంది. ఆ స్థలంలో ఇంటి నిర్మాణంతో పాటు ప్రహరీ, ఇంటి నెంబర్ అనుమతుల కోసం నానాజీపూర్ పంచాయతీ కార్యదర్శి రాధికను కలవగా, ఆమె రూ.60వేలు లంచం డిమాండ్ చేసింది. చివరికి రూ.35వేలకు ఒప్పందం చేసుకున్న బర్కత్ అలీ ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో సోమవారం పంచాయతీ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.35వేలు తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి రాధిక, బిల్‌కలెక్టర్ బాల్‌రాజ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

భూమి రిజిస్ట్రేషన్‌కు ఆరు వేలు..

ఏసీబీ అధికారులకు పట్టుబడిన ధరణి ఆపరేటర్ రాకేశ్, తహసీల్దార్ మాధవి

కమలాపూర్, మే 20 : వ్యవసాయభూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం తీసుకుంటుండగా తహసీల్దార్, ధరణి ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం హనుమకొండ జిల్లా కన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రాములపల్లికి చెందిన కసరబోయిన రాజయ్య పేరటి ఏడు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. ఇందులో మూడు ఎకరాల రెండు గుంటలను కొడుకు గోపాల్ పేర గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఈ నెల 9న మీసేవలో స్లాట్ బుక్ బుక్ చేశాడు. 10వ తేదీన రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గోపాల్ కుటుంబసభ్యులతో కలిసి తహసీల్ కార్యాలయానికి వెళ్లగా, ఫైల్ చూడకుండానే తర్వాత రమ్మని పంపించివేశారు. తిరిగి 18వ తేదీన వెళ్లగా రూ.6వేలు ఇస్తేనే పని జరుగుతుందని చెప్పడంతో చివరికి ఐదువేలకు ఒప్పందం చేసుకుని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం తహసీల్ కార్యాలయంలో గోపాల్ నుంచి తహసీల్దార్ మాధవి రూ. 4వేలు, ధరణి ఆపరేటర్ రాకేశ్ రూ.వెయ్యి తీసుకుంటుండగా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

బిల్లుల కోసం 8వేలు డిమాండ్

రాజన్న సిరిసిల్లలో ఏసీబీకి పట్టుబడ్డ పీఆర్ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు

రాజన్న సిరిసిల్ల, మే 20 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన గొల్లెని వెంకటేశ్ కాంట్రాక్టర్ 2021లో మైనార్టీ వెల్ఫేర్ ఫండ్ నిధులు రూ. 4.35 లక్షలతో కబ్రస్థాన్ చుట్టూ ప్రహరీ నిర్మించారు. నాలుగు నెలల క్రితం ఇందుకు సంబంధించిన బిల్లులు మంజూరవడంతో వెంకటేశ్ పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావును సంప్రదించి ఎంబీ రికార్డు చేయాల్సిందిగా కోరారు. అందుకు ఆయన రూ. 8వేలు డిమాండ్ చేయగా, అంత డబ్బు ఇవ్వలేనని అనడంతో చివరికి రూ. ఏడువేలు ఇవ్వాలని చెప్పాడు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం కలెక్టరేట్‌లోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి ఉద్యోగి భాస్కర్‌రావు డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

ఏపీలో హింసాత్మక ఘటనలపై ముగిసిన సిట్ విచారణ

- డీజీపీకి 150 పేజీల నివేదిక అందజేత

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : ఏపీలో ఎన్నికలకు ముందు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ముగిసింది. ఈ మేరకు హింసాత్మక ఘటనలపై సిట్ అధికారి వినీత్ బ్రిజ్ లాల్ 150 పేజీల నివేదికను ఆ రాష్ట్ర డీజీపీకి అందజేశారు. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటించిన 13 మంది సభ్యులతో కూడిన సిట్ బృందం ఆదివారం అర్ధరాత్రి వరకు విచారణను కొనసాగించింది. మూడు జిల్లాల్లో దాదాపు 33 హింసాత్మక ఘటనలు జరిగినట్టు తేల్చింది. పల్నాడు జిల్లాలోని 3 అసెంబ్లీ స్థానాల్లో 22 కేసులు, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 7 కేసులు, తిరుపతి జిల్లాలోని 2 అసెంబ్లీ స్థానాల్లో 4 కేసులు నమోదైనట్టు సిట్ వెల్లడించింది. క్షేత్రస్థాయిలో పోలీసులు, బాధితులు, ఇతర వర్గాల నుంచి సాక్ష్యాలు సేకరించి నివేదిక రూపొందించినట్టు వెల్లడించింది. 33 కేసుల్లో ఎఫ్ఐఆర్ ప్రకారం 1,370 మంది నిందితులుగా ఉన్నారని, ఇప్పటివరకు 124 మంది అరెస్టయ్యారని తెలిపింది. 1,526 మంది మూడు జిల్లాల నుంచి అల్లర్ల అనంతరం పరారైనట్టు వెల్లడించింది. కేసుల దర్యాప్తులోనూ తీవ్ర లోపాలు గుర్తించినట్టు సిట్ తన నివేదికలో పేర్కొన్నది.

పిఠాపురంలో హింసాత్మక ఘటనలు జరగొచ్చు

- ఈసీని అప్రమత్తం చేసిన ఇంటెలిజన్స్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : ఏపీలో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. పిఠాపురంలో కౌంటింగ్‌కు ముందు, ఆ తర్వాత హింసాత్మక ఘటనలు చోటు చేసుకొనే అవకాశం ఉన్నదని ఈసీకి ఇంటెలిజన్స్ వెల్లడించింది. కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకొనే అవకాశం ఉన్నదని ఇంటెలిజన్స్ అధికారులు నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. కాకినాడలోని ఏటిమొగ్గ, దుమ్ములపేట, రామకృష్ణారావుపేటపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించినట్టు తెలిసింది. ఎన్నికల్లో అల్లర్లకు కారణమైన వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కౌంటింగ్ రోజు అల్లర్లు పునరావృతం కాకుండా ముందస్తుగా పోలీసులు చర్యలు చేపట్టారు. కాగా, పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై పోలీసుశాఖ నిషేధం విధించింది. ఈసీ సస్పెండ్ చేసినా పోలీస్ అధికారుల స్థానంలో కొత్తవారిని నియమించింది.

ప్రొటీన్ లోపం వల్లే పార్కిన్‌సన్ వ్యాధి

- సీసీఎంబీ పరిశోధకుల వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ): వృద్ధుల్లో ఎక్కువగా కనిపించే పార్కిన్‌సన్ వ్యాధికి నాడీ కణాల్లో సైన్యూక్లీన్ ఆల్ఫా అనే ప్రొటీన్ లోపమే కారణమని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పరిశోధకులు తేల్చారు. దీని వలన మెదడుకు, నాడీ కణాలకు మధ్య సమాచార వ్యాప్తి నిలిచిపోతుందని వెల్లడించారు. శరీరంలో డోపమైన్ అనే హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల పార్కిన్‌సన్ వ్యాధి తీవ్రత పెరుగుతుందని తెలిపారు.

తిరుమలలో చిరుతల కలకలం

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : తిరుమలలో సోమవారం అలిపిరి నడక దారిలోని ఆఖరి మెట్టు వద్ద రెండు చిరుతలు సంచరించడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. భయంతో గట్టిగా కేకలు వేయడంతో చిరుతలు అడవిలోకి పారిపోయాయి. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తమై భక్తులను గుంపులుగా పంపించారు. చిరుతలను బంధించేందుకు అటవీశాఖ రంగంలోకి దిగింది. గత బుధవారం భక్తుల కారుకు ఓ చిరుత అడ్డురాగా ఆ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. గతంలో కూడా ఇదే ప్రదేశంలో చిరుతపులులు పలుమార్లు కనిపించడం గమనార్హం.

కార్పొరేట్ విద్యాసంస్థలను కట్టడి చేయండి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కార్పొరేటు విద్యాసంస్థలను కట్టడి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య సెక్రటేరియట్‌లో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చి ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని విన్నవించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 40 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇక్కడ బీసీ నేతలు నీలం వెంకటేశ్, గుజ్జ సత్యం, గొరిగే మల్లేశ్, రుషియాదవ్ ఉన్నారు.

'రెవెన్యూ'లో పదోన్నతులకు డీపీసీ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో పదోన్నతుల కల్పనకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)ని ఏర్పాటుచేసింది. ఈ మేరకు సోమవారం రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సీసీఎల్ఏ చైర్మన్‌గా, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ డిప్యూటీ సెక్రటరీ సభ్యులుగా ఉన్నారు.

200 కోట్లకుపైగా వసూళ్లు

ఐపీ పెట్టి బిచాణా ఎత్తేసిన ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ

బాధితుల ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదు

నిందితుల్లో టీఎస్‌సీబీ మేనేజర్ వాణీబాల, భర్త, కుమారుడు

ఇంటికి, కార్యాలయానికి తాళాలు వేసి అజ్ఞాతంలోకి

విదేశాలకు పారిపోయి ఉండొచ్చని అనుమానాలు

హైదరాబాద్‌లో సీసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ): అధిక వడ్డీ ఇస్తామంటూ దాదాపు 500 మంది ఖాతాదారులను నమ్మించి రూ.200 కోట్లకుపైగా డిపాజిట్లు సేకరించిన ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ.. చివరికి ఐపీ పెట్టి బిచాణా ఎత్తేసింది. దీనిపై బాధితులు సోమవారం సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. గతంలో హైదరాబాద్ అబిడ్స్‌లో బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంకు (ఏపీసీఓబీ).. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంకు (టీఎస్‌సీబీ)గా మారింది. అందులో చాలా కాలం నుంచి పనిచేస్తూ మేనేజర్‌గా పదోన్నతి పొందిన కృష్ణా జిల్లా వాసి నిమ్మగడ్డ వాణీబాల.. ఆ బ్యాంకుకు సమీపంలోనే తన భర్త నేతాజీ, కుమారుడు శ్రీహర్షతో 'ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్' అనే ఫైనాన్స్ సంస్థను ఏర్పాటు చేయించింది. ఆ సంస్థలో అధిక వడ్డీ చెల్లిస్తున్నారంటూ టీఎస్‌సీబీ ఖాతాదారులతోపాటు ఆ బ్యాంకు సిబ్బందిని సైతం నమ్మించి డిపాజిట్లు చేయించడంతో వారికి ప్రతి నెలా 15% వడ్డీ చెల్లిస్తూ వచ్చారు. దీంతో టీఎస్‌సీబీ నుంచి ఎంతో మంది ఖాతాదారులు తమ డిపాజిట్లను ఉపసంహరించుకుని 'ప్రియాంక'లో పెట్టుబడులు పెట్టారు. ఇలా గత 20 ఏండ్ల నుంచి రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను పెంచుకున్న ఆ సంస్థ.. నిరుడు నవంబర్ నుంచి డిపాజిటర్లకు వడ్డీలు సరిగ్గా చెల్లించడం లేదు. ఈ క్రమంలో ఈ నెల 3న ఆ సంస్థ దివాలా తీసినట్టు సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నెల 31న వాణీబాల రిటైర్ కానున్న నేపథ్యంలో ఆమె భర్త, కుమారుడు ఈ నెల 15న తమ కార్యాలయంతో పాటు సైదాబాద్‌లోని తమ ఇంటికి కూడా తాళం వేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో అబిడ్స్ పోలీసుల సూచన మేరకు బాధితులు సీసీఎస్‌ను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. నిందితులు విదేశాలకు పారిపోయి ఉండొచ్చని మూర్తి అనే బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు.

'జలవనరుల అభివృద్ధి' ఎండీగా విజయ్‌భాస్కర్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ ఎండీగా నాగర్‌కర్నూల్ సీఈ (ఎఫ్ఏసీ) విజయ్‌భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. కార్పొరేషన్ ఎండీగా గతంలో సీఈ హమీద్‌ఖాన్ ఉండగా, ఇటీవలనే ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో విజయ్‌భాస్కర్‌రెడ్డికి బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రామగుండ థర్మల్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

జ్యోతినగర్, మే 20: పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 62.5మెగావాట్ల సామర్థ్యం గల బీ థర్మల్ విద్యుత్ కేంద్రంలో సోమవారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ప్లాంట్ బాయిలర్‌లోని సూపర్‌హీటర్ కాయిల్ ట్యూబ్ ఓపెన్ కావడంతో అకస్మాత్తుగా పెంట్‌హౌస్ నుంచి వేడి బూడిద యాష్ పాండ్‌పైకి ఎగిరిపడ్డది. అప్రమత్తమైన ఇంజినీర్లు యూనిట్‌ను ట్రిప్ చేసి పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.

ఏపీలో రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేత

హైదరాబాద్; మే 20 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 22 నుంచి ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు స్పెషాలిటీ దవాఖానల సంఘం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు నుంచి రూ.1550 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని చెల్లించాలని ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈవో లక్ష్మి షాకు విజ్ఞప్తి చేసింది. మే 4 నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తామని చెప్పినా ప్రభుత్వం స్పందించలేదని పేర్కొంది. బిల్లులు చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని దవాఖానల సంఘం తెలిపింది.

కారు ఢీకొని ఇద్దరు మృతి

పీర్జాదిగూడ, మే 20: పీర్జాదిగూడ సాయి ఈశ్వర కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మాడె శ్రవణ్(25) సోమవారం రాత్రి బైక్‌పై మిత్రులు మేటి శివ, ఎల్ భానుతో కలిసి పీర్జాదిగూడ కమాన్ నుంచి పర్వతాపూర్‌లోని ఇంటికి వెళ్తున్నాడు. ఆరోరా ఇంజినీరింగ్ కాలేజ్ సమీపంలో వేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో శ్రవణ్ అక్కడికక్కడే మృతిచెందగా, శివ(24) చికిత్సపొందుతూ మృతి చెందాడు. భానుకు తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

అమెరికాలో జడ్జిగా తెలుగు మహిళ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : అమెరికాలో తెలుగు మహిళ జయ బాదిగకు అరుదైన గౌరవం దక్కింది. కాలిఫోర్నియాలోని శాక్రమెంట్ కౌంటీ సుపీరియర్ కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి కాలిఫోర్నియాలో జడ్జిగా బాధ్యతలు చేపట్టిన తొలి వ్యక్తిగా ఆమె నిలిచారు. విజయవాడకు చెందిన జయ బాదిగ.. హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్, బోస్టన్ విశ్వవిద్యాలయంలో ఎంఏ, శాంటాక్లారా విశ్వవిద్యాలయం నుంచి లా పట్టా అందుకున్నారు. 2009లో కాలిఫోర్నియా స్టేట్ బార్ ఎగ్జామ్ క్లియర్ చేశారు. పదేండ్లకు పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగారు. మెక్‌జార్జ్ స్కూల్ ఆఫ్ లాలో అధ్యాపకురాలిగా పనిచేశారు.

హెచ్ఐవీ తల్లులూ పాలివ్వొచ్చు

- దశాబ్దాల నా